క్లుప్తంగా

నెలాఖరు వరకు 144 సెక్షన్ అమలు

తెనాలి రూరల్: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అరెస్ట్, రిమాండ్ నేపథ్యంలో తెనాలి పట్టణం, మండలంలో 144 సెక్షన్ అమలు చేసినట్టు తహసీల్దార్ కె. రవిబాబు బుధవారం రాత్రి పొద్దుపోయాక తెలిపారు. ఆంక్షలు తక్షణమే అమల్లోకి వస్తాయని, 30వ తేదీ అర్ధ రాత్రి వరకు ఉంటాయని చెప్పారు. అనుమతులు లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించరాదని, నలుగురికంటే ఎక్కువ మంది గుమికూడదని సూచించారు. కర్రలు, రాళ్ల సహా ఎటువంటి ఆయుధాల్ని కలిగి ఉండకూడదని పేర్కొన్నారు. ఇప్పటికే పోలీసు శాఖకు కచ్చితమైన ఆదేశాల్ని జారీ చేశామని, నిబంధనల్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలుంటాయని తహసీల్దార్ స్పష్టం చేశారు.

పేదలకు అన్నదానం



తెనాలి అర్బన్: శ్రీ వీరశైవ బసవేశ్వర సేవా సంఘం తెనాలి వారి ఆధ్వర్యంలో చెంచుపేటలోని ప్రభుత్వ వైద్యశాల వద్ద గురువారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధి ఎస్.శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెలా అమావాస్య రోజున పేదలకు అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్.విజయలక్ష్మి, పాలకొల్లు బసవేశ్వరరావు, ఎస్.భాస్కరరావు, కె.మల్లికార్జునరావు, చుక్కా శ్రీనివాసబాబు, భానుప్రసాద్, నాగమల్లేశ్వరి, రాజారాం, సతీష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యల్ని పరిష్కరించాలి



తెనాలి: అంగన్‌వాడీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు సమస్యల్ని పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ విజ్ఞప్తిచేశారు. అంగన్‌వాడీ తెనాలి ప్రాజెక్ట్ మహాసభ గురువారం స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. రంగపుష్ప, నిర్మల జ్యోతి, అనూరాధ అధ్యక్షత వహించారు. రైతు సంఘ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి, సీఐటీయూ తెనాలి కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలి, అంగన్‌వాడీ జిల్లా నాయకులు ఏ.వి.ఎస్. కుమారి పాల్గొన్నారు. తెనాలి ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షులుగా అనూరాధ, ప్రధాన కార్యదర్శిగా ఏ.వి.ఎస్. కుమారి, మరో 13 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు

తాడేపల్లి రూరల్: కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెస్సల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) విజయవాడ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అమరావతి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.వి. తులసీరామ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, మహానాడులో గల అసిస్టెంట్ ఇంజినీర్ వారి కార్యాలయ ప్రాంగణంలో విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు కార్యక్రమం ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్, ఫోరం సభ్యులు, సూపరింటెండింగ్ ఇంజినీర్, సీఆర్‌డీఏ అమరావతి విద్యుత్ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులు రాతపూర్వకంగా సర్వీస్ కనెక్షన్ నంబర్, పూర్తి చిరునామా, సెల్ నంబర్‌తో అర్జీ ఇచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. విద్యుత్ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, మీటరు సమస్యలు, బిల్లుల సమస్యలు, విద్యుత్ సరఫరా సమస్యలు పరిష్కరిస్తామని వివరించారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.వి.తులసిరామ్ కోరారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వేను పక్కాగా చేపట్టాలి

కొల్లూరు : ప్రభుత్వం చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రభుత్వ శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కొల్లూరు మండల ప్రత్యేకాధికారి రమణ అన్నారు. గురువారం కొల్లూరు మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో వైద్య, ఆరోగ్య, ఐసీడీఎస్, పంచాయతీ కార్యదర్శులతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో శుక్రవారం నుంచి వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టి, అవసరమైన వైద్య పరీక్షలు చేయడం, వారికి చేపట్టాల్సిన వైద్య సేవలను గుర్తించాలన్నారు. ఏ గృహాన్ని వదిలి పెట్టడానికి వీలులేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం చేపట్టే సర్వే ఆధారంగా భవిష్యత్తులో ప్రతి ఇంటికీ అవసరమైన వైద్య సేవలను సత్వరం అందజేయడం ద్వారా అనారోగ్యంతో బాధపడే ప్రతి ఒక్కరికీ సకాలంలో వైద్యం అందజేయడానికి వెసులుబాటు ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఈఓపీఆర్డీ రవిబాబు, ఆర్ఐ త్రివేణి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఆరోగ్య రక్ష...ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ఆశయం

- సమష్టి కృషితో నూరు శాతం విజయవంతం చేయాలి
- జగనన్న ఆరోగ్య సురక్ష సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: ప్రతి ఇంటికీ ఆరోగ్య రక్షణ కల్పించడం ద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాకారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని, సమష్టి కృషితో విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపెయిన్‌కు ముందుగా గురువారం సాయంత్రం పట్టణ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఏర్పాటైన సన్నాహక సమావేశానికి మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ అధ్యక్షత వహించారు. పీపీ యూనిట్ సిబ్బంది, యూపీహెచ్‌సీ వైద్యాధికారులు, మున్సిపల్ అధికారులు, సచివాలయం అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల నుద్దేశించి ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడారు. 'జగనన్న సురక్ష' అమలులో జిల్లాలోనే తెనాలికి మంచి పేరొచ్చిందని గుర్తుచేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష అంతకుమించి ఉదాత్తమైందని చెప్పారు. ప్రజలందరి ఆరోగ్యానికి సంబంధించినది అయినందున ప్రజాప్రతినిధులు, వైద్యసిబ్బంది, అధికారులు మనసుతో పని చేయాలని తెలిపారు. పేదవాడి ఆరోగ్యం కోసం మహానుభావుడు డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీని తీసుకొచ్చి పేదల జీవితకాలాన్ని పెంచారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మరో అడుగు ముందుకేసి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కోసం నడుంకట్టారని చెప్పారు. వైద్యశాలల్ని ఆధునీకరించడం, ఆధునిక వైద్య పరికరాల్ని సమకూర్చడం, వైద్యులు, సిబ్బందిని భర్తీచేసి, తగిన మందుల్ని సిద్ధం చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని స్పష్టం చేశారు. వీటికితోడు ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్, అర్బన్ హెల్త్ సెంటర్లను తీసుకొచ్చి ప్రజలకు ఆరోగ్య భరోసానిస్తున్నారని చెప్పారు. మళ్లీ ఇప్పుడు ప్రజల ముంగిటకే ఆరోగ్య రక్షను చేపట్టారని తెలిపారు. ఆరోగ్యం, వైద్యం అందరి అవసరంగా చెప్పారు. ముందుగా వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి, అందరి ఆరోగ్య అవసరాల్ని తెలుసుకోవాలని చెప్పారు. త్వరలో చేపట్టే ఆరోగ్య శిబిరాల్లో వారికి కావల్సిన వైద్యచికిత్సలు, మందులు అందజేస్తామన్నారు. ముఖ్యమంత్రి ఏది చేసినా కచ్చితంగా చేస్తారన్న విశ్వాసం ప్రజలకు ఉందని చెబుతూ ఆ నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజలందరికీ మంచి వైద్యం అందించే మహత్తరమైన అవకాశాన్ని చిత్తశుద్ధితో చేపట్టాలని కోరారు. తద్వారా వృత్తిపరమైన సంతృప్తిని పొందుతారనీ, ప్రభుత్వానికి మంచి పేరొస్తుందని వివరించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు మాట్లాడుతూ జగనన్న సురక్షలో 9163 సర్టిఫికెట్లను పంపిణీ చేశామని గుర్తు చేశారు. జగనన్న ఆరోగ్య సురక్షను నూరుశాతం విజయవంతం చేస్తామని చెప్పారు. డీపీఎంయూ డాక్టర్ రత్న మన్మోహన్, ఇన్‌చార్జి డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాంబాబు, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఎంఈవోలు డాక్టర్ ఎం.లక్ష్మీనారాయణ, వి.జయంతీబాబు, ఎంఎల్‌వో చెన్నకేశవులు, డాక్టర్ కిశోర్‌కుమార్ మాట్లాడారు. కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, షేక్ ఇస్మాయిల్, షేక్ దుబాయ్‌బాబు, పార్టీ నేతలు కుక్కల ముక్తేశ్వరరావు (వాసు), కఠారి హరీష్, కాళిదాసు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భరోసానిస్తున్న సీఎం సహాయనిధి



చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఆరోగ్యశ్రీ పరిధిలో లేని అనారోగ్యంతో బాధపడుతూ వైద్యఖర్చుల్ని భరించలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసాలాంటిదని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఏడుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద వచ్చిన రూ.15.62 లక్షల చెక్కుల్ని గురువారం స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. వీరిలో రావి రవికాంత్‌కు రూ.7 లక్షలు, గాదె శారదకు రూ.4.50 లక్షలు, మండేల స్టీఫన్‌రాజుకు రూ.లక్ష చెక్కుల్ని అందజేశారు. రాష్ట్రప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఇప్పటివరకు సీఎం సహాయనిధి కింద రూ.192 మందికి రూ.1.48 కోట్లను అందజేసినట్టు ఎమ్మెల్యే చెప్పారు.

భక్తిశ్రద్ధలతో 'కనికరయుత కార్యములు' పండుగ



మాట్లాడుతున్న రెవరెండ్ ఆశీర్వాదం

తెనాలి టౌన్: రూరల్ మండలం కఠెవరంలోని క్రీస్తు దేవాలయంలో గురువారం 'కనికరయుత కార్యములు' పండుగను నిర్వహించారు. రెవరెండ్ కె.ఆశీర్వాదం అధ్యక్షత సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. సంఘ కాపరి నాలాది డేవిడ్‌రాజు, కౌన్సిలర్ మెంబర్లు, ఉపాధ్యక్షులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, అభిషిక్తులు, వివిధ సంఘాల గురువులు, ప్రతినిధులు, సంఘ పెద్దలు, సంఘస్థులు, డెలిగేట్స్, సభ్యులు పాల్గొన్నారు.

దోమతెరల పంపిణీ

తెనాలి అర్బన్: లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో తెనాలి డబల్ హార్స్ సంస్థ సహకారంతో రామలింగేశ్వరపేట డొంక రోడ్డులో యాభై మంది పేదలకు గురువారం దోమతెరల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ప్రతినిధి అబ్దుల్ వహీద్ బాషా మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో దోమలు పెరిగే అవకాశం ఉందని, వాటి బారి నుంచి కాపాడుకునేందుకు దోమతెరల్ని పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ కో-ఆర్డినేటర్ రాధిక, అసిస్టెంట్ మలేరియా అధికారి సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి, మలేరియా, ఫైలేరియా సిబ్బంది రవికుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

చవితి వేడుకలకు కొలువుదీరిన విగ్రహాలు



తెనాలిలో వినాయక చవితి వేడుకలకు సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు

తెనాలి టౌన్: పట్టణ, రూరల్ గ్రామాల్లో వినాయక చవితి పండుగ వాతావరణం కనపడుతోంది. గ్రామాల్లోని ముఖ్య కూడళ్లు, సెంటర్లలో నిర్వాహకులు పందిళ్లు వేసి విద్యుత్ అలంకరణ చేస్తున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల వినాయక ప్రతిమలు కొలువుదీరాయి. ఈ నెల 18న పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో వినాయ ప్రతిమల్ని సెంటర్లలో ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా పూజల్ని నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని వీఎస్ఆర్ కాలేజీ రోడ్డులో సైజుల వారీగా అమ్మకానికి ప్రతిమల్ని ఉంచారు. పలువురు కొనుగోలు చేసి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు.

విగ్రహాల తయారీకి మట్టిని, నీటి రంగులనే వాడాలి

తెనాలి: వినాయక చవితి ఉత్సవాల్ని పర్యావరణహితంగా నిర్వహించాలని తెనాలి మండల తహసీల్దారు కె.రవిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వినాయక విగ్రహాల తయారీ, నిమజ్జనానికి సంబంధించి రాష్ట్ర కాలుష్య నివారణ మండలి ఉత్తర్వుల్ని తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. ప్రతిమల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, థర్మాకోల్, ప్లాస్టిక్ వంటి విషపూరితమైన పదార్థాల్ని వినియోగించరాదని తెలిపారు. ప్రకృతి సిద్ధమైన, పర్యావరణహితమైన మట్టితో చేసిన వినాయకుని ప్రతిమల్ని మాత్రమే నీటిలో నిమజ్జనం చేయాలని సూచించారు. వినాయకుడిని అలంకరించే ఆభరణాల తయారీకి కూడా చెట్లు, మొక్కల నుంచి తీసుకున్న మెత్తటి గుజ్జు, ఎండిన పూలు వంటి ఆర్గానిక్ పదార్థాల్ని మాత్రమే వినియోగించాలని తెలిపారు. విషపూరితమైన, నశించే స్వభావం లేని రంగులు, రసాయనాలు, ఆయిల్ పెయింట్లు, ప్లాస్టిక్ వంటివి విగ్రహాల తయారీలో వాడరాదని స్పష్టంచేశారు. వీటికి బదులుగా పర్యావరణహితమైన నీటి ఆధారంగా తయారైన సహజమైన రంగుల్ని మాత్రమే ఉపయోగించాలని చెప్పారు. పూజా వేదిక వద్ద ప్లాస్టిక్ వస్తువులను వాడరాదని, వినాయకుని విగ్రహాల్ని తయారు చేసి, విక్రయించే వారంతా ఈ నియమాలను తప్పక పాటించేలా పోలీసు, మున్సిపల్, పంచాయతీ, ఆరోగ్యశాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారుల పర్యవేక్షించాలని కోరారు. అవసరమైతే కాలుష్య నియంత్రణ మండలి అధికారుల్ని సంప్రదించాలని వివరించారు. వినాయక ఉత్సవ కమిటీలు ముందుగా పోలీస్, మున్సిపాలిటీ, పంచాయతీ అధికారుల అనుమతి తీసుకోవాలని ఆయన సూచించారు.

మాతృభాషతో ఇతర భాషలపైనా పట్టు అవసరం



ప్రదర్శనను పరిశీలిస్తున్న శివరామకృష్ణ, ఉపాధ్యాయులు

తెనాలి రూరల్: తి భాషా సూత్రంగా విద్యార్థులందరూ హిందీ నేర్చుకోవాలని తెనాలి మండలం సంగంజాగర్లమూడి జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ఎ. శివరామకృష్ణ సూచించారు. జాతీయ హిందీ దివస్‌ను పురస్కరించుకుని పాఠశాలలో గురువారం హిందీ భాష, సాహిత్యంపై ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ మాతృభాష అయిన తెలుగుతో పాటు ఇంగ్లిష్, హిందీ భాషల్లో విద్యార్థులు పట్టు సాధించాలని ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

బకింగ్‌హామ్ కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహం



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని బకింగ్‌హామ్ కెనాల్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని తాడేపల్లి పోలీసులు గురువారం వెలికితీశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బకింగ్‌హామ్‌కెనాల్‌లో మహిళ మృతదేహం కొట్టుకు వచ్చినట్లు సమాచారం అందడంతో పశువుల హాస్పిటల్ బ్రిడ్జి వద్దకు వెళ్లి బయటకు తీశామని తెలిపారు. మహిళను గుర్తించేందుకు ఆధారాలు లభించలేదని, వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉండొచ్చని చెప్పారు. ఎత్తు 5 అడుగులు, ఒంటిపై చుడీదార్, కింద ప్యాంటు బ్లూ కలర్‌పై ఎరుపు, తెలుపు పూలు ఉన్నాయని, పై కోటు గులాబీ రంగు కలిగి ఉందని తెలిపారు. మహిళను ఎవరైనా గుర్తిస్తే తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆర్థిక నేరగాడికి వత్తాసు సిగ్గుచేటు



మంగళగిరి : ఆర్థిక నేరగాడికి వత్తాసు పలకడం సిగ్గుచేటని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆర్కే గురువారం పరిశీలించారు. పనులు సత్వరమే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాజకీయ పార్టీలతో పొత్తుల గురించి మాట్లాడాల్సిన అవసరం లేదని, జనసేన నాయకుడు పవన్ కల్యాణ్, చంద్రబాబు ఎప్పుడూ పొత్తులోనే ఉన్నారన్నారు. ప్రజలకు ప్రజాపాలన అందించి సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మన్ననలు పొంది మరలా ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందనే అక్కసుతో పవన్ కల్యాణ్ చంద్రబాబుకు మద్దతు ఇచ్చి డ్రామాలాడుతున్నారని విమర్శించారు. ఎవరెన్ని కుయుక్తులు చేసినా వచ్చే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం, వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ ఎంపికలు



క్రీడాకారిణులతో ప్రజాప్రతినిధులు, అధికారులు



కబడ్డీలో కొల్లూరు, అనంతవరం జట్లు

భట్టిప్రోలు: భట్టిప్రోలు కేఎస్‌కే బాలికల జూనియర్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలికలకు గురువారం ఆటల పోటీలు జరిగాయి. అండర్-14, 17 విభాగంలో మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్‌ను నిర్వహించారు. ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి ప్రారంభించారు. శుక్రవారం మండల స్థాయిలో బాలుర విభాగంలో పోటీలు జరుగుతాయని ఎంఈవోలు పులి లాజర్, నీలం దేవరాజ్ ఈ సందర్భంగా తెలిపారు. క్రీడా పోటీల కో-ఆర్డినేటర్ దాసరి వెంకట ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, హరిప్రసాద్, లక్ష్మి, పీఈటీలు జీవీఎస్ నాగేశ్వరరావు, ఎండీ అనూల్‌హక్, చేబ్రోలు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కొల్లూరులో..

కొల్లూరు బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాలలో పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయిలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించి, జట్లను ఎంపిక చేశారు. కబడ్డీలో బాలురు, బాలికల విభాగంలో 4 జట్లను ఎంపిక చేయగా, వాలిబాల్‌లో బాలురు రెండు జట్లను ఎంపిక చేశారు. తొలుత ఆటల పోటీలను వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఇన్‌చార్జి ఎంఈఓ-1 వెంకటేశ్వర్లు, విద్యాకమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. నాగపాప ప్రారంభించారు. స్కూల్ గేమ్స్ పెడరేషన్ మండల కన్వీనర్ పెదపూడి నాగేశ్వరరావు, పలు పాఠశాలల పీఈటీలు పర్యవేక్షించారు.

అక్టోబర్ 22 నుంచి సీపీఎం బస్సు యాత్ర

రేపల్లె రూరల్: రాష్ట్రంలో ప్రజా సమస్యలపై అక్టోబర్ 22 నుంచి నవంబర్ 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా సీపీఎం బస్సు యాత్ర చేపడుతోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు యాత్ర తలపెట్టామన్నారు. సెప్టెంబర్ 7న యాత్ర ముగింపు రోజు విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్, నాయకులు లక్ష్మణరావు, ఆశీర్వాదం పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల సమస్యలను పరిష్కరించాలి

రేపల్లె రూరల్: డ్వాక్రా మహిళల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. మోసపోయిన మహిళలు 20 రోజుల నుంచి పోరాటం చేస్తున్నా సమస్యకు పరిష్కారం చూపించలేదన్నారు. డ్వాక్రాలో ఉన్న పేద మహిళలను టార్గెట్ చేసి, సుమారు రెండు కోట్ల రూపాయల వరకు అవినీతి జరిగితే జిల్లాలో ఉన్న మెప్మా పీడీ సరిగ్గా స్పందించకపోవడం తగదన్నారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్, మహిళా సంఘం రేపల్లె పట్టణ కమిటీ కార్యదర్శి షేక్.ఆశ, గౌరవాధ్యక్షురాలు ఆర్.నాగమణి, కోశాధికారి షబానా సుల్తానా ఉపాధ్యక్షురాలు కె.నాంచారమ్మ పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పట్నంబజారు: మహిళ మెడలో గొలుసు లాక్కొని పరారైన ఘటనపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్‌వీఎన్ కాలనీకి చెందిన డి.సులోచన ఇంటి నుంచి వేరే వారి ఇంటికి పనుల నిమిత్తం వెళుతోంది. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు ఆమె మెడలోని గొలుసు లాక్కొనే ప్రయత్నం చేశారు. సగం గొలుసు సులోచన చేతిలో ఉండగా, మరో సగం గొలుసు నిందితులు లాక్కొని పరారయ్యారు. ఎనిమిది సవర్ల గొలుసు చైన్‌స్నాచింగ్ జరిగిందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తెనాలి 3వ వార్డులో పింఛన్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ కోటయ్య



22వ వార్డులో పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ దుబాయ్‌బాబు



కఠెవరంలో అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు భానుప్రసాద్, నాయకులు



7వ వార్డులో పంపిణీ చేస్తున్న వైస్ చైర్మన్ హరిప్రసాద్



34వ వార్డులో పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ సంజీవరెడ్డి



33వ వార్డులో దివ్యాంగుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ అహ్మద్‌బేగ్

పింఛన్ వచ్చె..ఆనందం తెచ్చె

పట్టణంలో నూతన పింఛన్ల పంపిణీ గురువారం కొనసాగింది. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు పంపిణీ చేశారు. 7వ వార్డులో నూతనంగా మంజూరైన ఏడు పింఛన్లను మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

– తెనాలి అర్బన్/తెనాలి టౌన్